
ప్రజాశక్తి
గురువారం 21 సెప్టెంబర్ 2023 5 విజయనగరం



నేడు గురజాడ 161వ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం

మహాకవి గురజాడ 161వ జయంతి వేడుకలను వారి గృహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గురజాడ అప్పారావు విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. 9.45 గంటలకు గురజాడ అప్పారావు ఉపయోగించిన వస్తువులతో వారి స్వగృహం నుండి గురజాడ కాంస్య విగ్రహం వరకు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 10 గంటలకు గురజాడ అప్పారావు కాంస్య విగ్రహానికి నగర ప్రముఖులతో పూలమాలాలంకరణ, 'దేశమంటే మట్టి కాదోయ్' సామూహిక దేశభక్తి గీతాలాపన జరుగుతుందని వివరించారు. 10.15 గంటలకు ప్రముఖుల సందేశాలు ఉంటాయని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

తెలుగోడి సత్తా చాటుదాం..
స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం
- విశాఖ ఉక్కు రక్షణ యాత్రకు ఘన స్వాగతం



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగు ప్రజల సత్తా చాటి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా కాపాడుకుందామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ప్రారంభమైన విశాఖ ఉక్కు రక్షణ బైక్ యాత్ర బుధవారం సాయంత్రం విజయనగరానికి చేరుకుంది. స్థానిక వై-జంక్షన్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యాన యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వై-జంక్షన్ నుంచి మయూరి జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్‌సిఎస్, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంట స్తంభం, మూడు లాంతర్లు, కోట జంక్షన్ మీదుగా బాలాజీ కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలాజీ జంక్షన్ సమీపంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంతోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ల ద్వారా ఇక్కడ ఉపాధి లభిస్తోందని తెలిపారు. దీన్ని ప్రయివేట్ పరం చేయడమంటే దళితులు, గిరిజనులు, బిసిలు ఉపాధి కోల్పోతారని, సామాజిక న్యాయం హరించుకుపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నేటికీ ప్లాంట్లో ఉపాధి కోసం ఎదురు చూస్తున్న 8500 మంది నిర్వాసితుల ఆశలు అడియాశలు అవుతాయని వాపోయారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో నడిస్తే మరో పాతిక వేల మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్టీల్‌ప్లాంటును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరిస్తే ఉత్తరాంధ్ర మరింత వెనుకబాటులోకి నెట్టబడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన కేంద్ర నిర్ణయానికి వంతపాడటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ పార్టీలు కేంద్రంలోని బిజెపి విధానాలను బలపరిచేవిగా ఉన్నాయని ఆక్షేపించారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడుకోవడం కేవలం తెలుగు ప్రజల చైతన్యంపైనే నేడు ఆధారపడి ఉందన్నారు. తెలుగు ప్రజల పౌరుషాన్ని చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

అనంతరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు ఎంతో ద్రోహం చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని మాత్రం పల్లెత్తు మాట అనడానికి కూడా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు సాహసించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాన్ని రాష్ట్రంలోని ప్రధాన మూడు రాజకీయ పార్టీలు ఎదుర్కోలేవని, బిజెపికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరిస్తున్నాయని తేటతెల్లమైందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకంగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ని అమ్మేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. 29న విశాఖలో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



బైక్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న తమ్మినేని సూర్యనారాయణ, రవణమ్మ

ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రూపొందించిన గీతాలకు ప్రజా నాట్య మండలి కళాకారులు నృత్య ప్రదర్శన చేసి అలరించారు. సభలో సిపిఎం పాడేరు, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నాయకులు సత్యనారాయణ, జగన్, తిరుపతిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.వి.రమణ, నాయకులు జగన్, పి.రమణమ్మ, పి.రామ్మోహన్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రామారావు, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



బహిరంగసభకు హాజరైన జనం

టిప్పర్ ఢీకొని
ఇద్దరు మృతి

ఒకరి పరిస్థితి విషమం

కుమారుడు పుట్టాడని ఆ కుటుంబంలో ఆనందం ఓవైపు.. బంధుమిత్రులతో కలిసి సరదాగా బారసాల చేసుకుందామన్న ఆలోచన మరోవైపు... ఆ సంతోషం ఆ ఇంట ఎంతో సమయం నిలువలేదు. కొడుకు బారసాలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు తన మిత్రులతో కలిసి విజయనగరం మార్కెట్‌కు వచ్చిన ఆ తండ్రిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కొడుకు పుట్టాడని ఆనందిస్తున్న ఆ తల్లికి.. భర్త అకాల మరణ సమాచారం తెలియడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. స్నేహితుడి ఇంట శుభకార్యానికి సహాయం కోసం వెంట వెళ్లిన మిత్రుడినీ టిప్పర్ మింగేసింది. ఈ హృదయ విదారకర సంఘటన మంగళవారం రాత్రి నగరంలోని కే ఎల్ పురం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..





మృతిచెందిన సత్యనారాయణ, సుందరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెంటాడ మండలంలోని కొంపంగి గ్రామానికి చెందిన జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్న భోగిన సత్యనారాయణ(32)కు కొద్దిరోజుల క్రితం మొదటి సంతానంగా బాబు పుట్టాడు. దీంతో సత్యనారాయణ కుమారుని బారసాల సామగ్రిని కొనేందుకు మ్యాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్న తన మిత్రులైన అదే మండలం జక్కువ గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి సుందరరావు అలియాస్ రాజు (25), బొడ్డు గౌరీశంకర్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై విజయనగరం వచ్చారు. మార్కెట్ పనులు ముగించుకున్న అనంతరం ముగ్గురు విజయనగరంలో భోజనం చేసిన తర్వాత రాత్రి 10 గంటలు దాటాక తిరుగు పయనమయ్యారు. కె.ఎల్.పురం వద్ద ఆర్‌టిఒ కార్యాలయం నుంచి విజయనగరం వైపు వస్తున్న టిప్పర్ వారిని ఢీకొంది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన సుందరరావు, గౌరీశంకర్‌ను జిల్లా కేంద్రాస్పత్రికి వెంటనే తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుందరరావు మరణించాడు. గౌరీ శంకర్ తీవ్ర గాయాలతో విశాఖలో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. వన్‌టౌన్ ఎస్ఐ గోపాల్, ఎఎస్ఐ జగన్మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం'

విజయనగరం : ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 22న నెల్లిమర్ల, 27న గజపతినగరం, 29న చీపురుపల్లి ఎంపిడిఒ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ

పింఛను కోసం ఉధృత ఉద్యమాలు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ

ప్రజాశక్తి-రాజాం

దేశవ్యాప్తంగా పింఛను కోసం ఉద్యోగులు ఉధృత ఉద్యమాలు సాగిస్తున్నారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద పీపుల్స్ ఫర్ ఇండియా ఆధ్వర్యాన చైర్మన్ ఎం.అప్పలనాయుడు అధ్యక్షతన 'ఎన్‌పిఎస్ రద్దు.. ఒపిఎస్ అందరికీ' అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో 2004 నుంచి అమలు చేస్తున్న నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్) వల్ల ఉద్యోగులకు పింఛను భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పింఛను భిక్ష కాదని, ఉద్యోగుల హక్కని 1982 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పిచ్చిందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు పాత పింఛను కోసం ఉద్యమాలు సాగిస్తున్నారని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా పింఛను కోసం జాతా జరుగుతుందని, మన రాష్ట్రంలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీపుల్స్ ఫర్ ఇండియా కన్వీనర్ డివిఎస్ శ్రీనివాసరావు, పలు సంఘాల నాయకులు ఎం.మోహబ్, పక్కి వేణు, ఎన్.రామకృష్ణ, ఎం.జితేంద్రరావు, రామ్మూర్తినాయుడు. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంతృప్తే లక్ష్యంగా వినతుల పరిష్కారం

- 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ నాగలక్ష్మి
- ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ, చేయూత మార్టు సందర్శన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జగనన్న చెబుదాం కార్యక్రమంలో వస్తున్న వినతులకు ప్రజల సంతృప్తే లక్ష్యంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లాలో తొలిసారిగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో బుధవారం శృంగవరపుకోట మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 వినతులందాయి. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి సుదర్శన దొర తదితరులు పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని, ఆయా శాఖల అధికారులకు తగిన పరిష్కారం నిమిత్తం ఆదేశాలు జారీచేశారు. అత్యధికంగా రెవెన్యూశాఖకు 24, గృహనిర్మాణానికి 13 అర్జీలందాయి. ఇకపై ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజావినతులను స్వీకరిస్తారని తెలిపారు. మే 9న ఈ కార్యక్రమాన్ని చేపట్టిన నాటి నుంచి శృంగవరపుకోట మండలంలో 315 వినతులు జగనన్నకు చెబుదాంలో వచ్చాయని, ఈ సమస్యల పరిష్కారంపై 109 మంది అర్జీదారులను ఫోన్‌లో సంప్రదించగా 63 మంది నుంచి అసంతృప్తి వ్యక్తమైందని తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతుల్లో మూడో వంతు రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం చేపడుతున్న భూసమగ్ర సర్వే ద్వారా చాలా సమస్యలను పరిష్కరించవచ్చన్నారు.

☞ ఎస్.కోట పట్టణంలోని 13వ వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరి సర్వే నంబర్ 462లో 28 ఎకరాలు ఉన్న రాజు చెరువు ఆక్రమణకు గురైందని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దానిని తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ స్థానిక అధికారులు స్పందించలేదని వివరించారు. ఈ విషయమై వివరణ ఇవ్వాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

☞ తాటిపూడి వద్ద ఏర్పాటుచేసిన ప్రయివేటు లేఅవుట్‌కు ప్రభుత్వ భూముల్లో రహదారులు నిర్మించారని, నాలుగు చెరువులను ఆక్రమించుకున్నారని వైస్ ఎంపిపి సుధా రాజు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణపై సంతృప్తి

ఎస్.కోటలో పర్యటించిన కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ వార్డు, ప్రసూతి వార్డు, మహిళా, పిల్లలు, ఆరోగ్యశ్రీ వార్డులను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య చికిత్సలు, సదుపాయాలు, భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి ఏవిధంగా వైద్యం అందుతున్నదీ తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలు బాగున్నాయని, వైద్యులు సరిగా స్పందిస్తున్నారని పలువురు రోగులు కలెక్టర్‌కు వివరించారు.

మహిళా మార్టుకు ప్రశంసలు

ఎస్.కోట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేయూత మహిళా మార్టును కలెక్టర్, జెసి మయూర్ అశోక్ సందర్శించారు. మార్టు నిర్వహణపై ఎపిడి సావిత్రి, మండల సమాఖ్య ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలలక్రితం గరివిడి, శృంగవరపుకోటల్లో రెండు మహిళా మార్టులను ప్రారంభించామని, ఇక్కడ మార్టుపై రూ.40 లక్షలు పెట్టుబడి పెట్టారని, ఆరు నెలల కాలంలో రూ.1.30 కోట్లు విక్రయాలు జరిపారని, అన్ని ఖర్చులూ పోను నెలకు రూ.3 లక్షల వరకు నెలకు లాభం వస్తుందని వారు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ సమాఖ్య సభ్యులను ప్రశంసించారు.

మహిళా బిల్లుపై హర్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారతకు ఎంతగానో కృషి చేస్తూ రాజకీయంగా, సామాజికంగా, సంక్షేమ పథకాల్లో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారని కొనియాడారు. వివిధ కార్పొరేషన్లు, పార్టీ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడో తీసుకున్న నిర్ణయం నేడు దేశానికే ఆదర్శవంతంగా నిలిచిందని పేర్కొన్నారు.

ఒబిసి మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్

జాతీయ బిసి సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చట్టసభల్లో ఒబిసి మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ చట్టం కావాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. బుధవారం బిసి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడాన్ని శుభపరిణామమని తెలిపారు. దేశంలో కులగణన జరగకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం వల్ల ఒబిసి మహిళలకు ఎటువంటి మేలూ జరగదని చెప్పారు. దేశంలో 80 శాతం మంది ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు చెందిన ప్రజలు స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా వీరికి చట్టసభలలో సరైన ప్రాతినిధ్యం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు కేటాయించిన సీట్లలో పురుషులు అధికారం చలాయిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు ఆర్.రామారావు, ఎస్ఎస్ రెడ్డి, పందిరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి దారపు శ్రీనివాసరెడ్డి, గువ్వల రవి పాల్గొన్నారు.

సిఎం హామీలు అమలు చేయాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి వినతి పత్రం అందజేశారు. నగరంలోని కోలగట్ల నివాసంలో ఫెడరేషన్ నాయకులు ఆయన్ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష నేతగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని చెప్పారు. మరోవైపు బలవంతంగా ఆప్కోస్‌లో చేర్చారని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులను ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే ఇంటికి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దాదాపు 30 ఏళ్లపాటు ప్రాణాలకు తెగించి పారిశుధ్య విభాగంలో సేవలందించి రిటైర్ అయిన కార్మికుల దుస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. సిఎం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022 జులై 11 నుంచి 15 వరకు జరిగిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎ.జగన్మోహన్, బి.భాస్కరరావు, కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో సమర్థ సేవలు

ప్రజాశక్తి-విజయనగరం

పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతమైన సేవలు అందించడానికి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టరు జె.మురళి చెప్పారు. విజయనగరం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పంచాయతీ కార్యదర్శుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన ప్రసంగించారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో స్థానిక ప్రభుత్వమైన గ్రామ పంచాయతీలకు పరిపాలన పరమైన అధికారాలను చట్టంలో కల్పించిందన్నారు. దీనిలో భాగంగా పరిపాలనలో సామర్థ్యాలను పెంపొందించానికి ఈ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. పంచాయతీల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో తీసుకునే చర్యలపై కేస్ స్టడీ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, ఎఒ కామేశ్వరరావు, శిక్షణ కేంద్రాల ఇన్‌ఛార్జులు ఎ.దేవుడు, జయ రామ లక్ష్మి, రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి

నగర అభివృద్ధే ధ్యేయం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని రంగాల్లోనూ విజయనగరం అభివృద్ధే ధ్యేయంగా కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. బుధవారం నగరంలోని 9, 32 డివిజన్లలో రూ.36 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్ కలిసి ప్రారంభించారు. రెండు డివిజన్ల పరిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కలియ తిరిగి, స్థానిక సమస్యలపై ఆరాతీశారు. తొలుత తోటపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సందర్శించి, పూజలు నిర్వహించారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో రూ.10 లక్షలతో దోబీఖానా నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రెడ్డి, కార్పొరేటర్లు భోగాపురపు లక్ష్మి, పట్టా ఆదిలక్ష్మి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, సయ్యద్ గౌస్, పిలకా శ్రీనివాస్, తోనంగి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్‌ను రద్దు చేసి, జిపిఎస్ తేవడం సరికాదని, ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.శివ మాట్లాడుతూ జిపిఎస్ పేరుతో మోసం చేస్తే తిప్పి కొడతామన్నారు. సిపిఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి కె.ధనుంజయ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తే ఏఒక్కరూ క్షమించరన్నారు. 4 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగుల ఉసురు పోసుకోవద్దని కోరారు.

నగరంలో కమిషనర్ విస్తృత పర్యటన

విజయనగరం టౌన్ : నగరంలో వివిధ ప్రాంతాలలో కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత స్థానిక పాలాసుపత్రి భవన ప్రాంగణాన్ని పరిశీలించారు. భవనం మరమ్మతులకు గురికావడంతో అవసరమైన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పరిస్థితిని గమనించారు. అక్కడే ఉన్న పార్కు పరిసరాలను పరిశీలించారు. అనంతరం సామాజిక మరుగుదొడ్ల నిర్వాహకులతో మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా ఉండాలని చెప్పారు. ఎక్కడైనా పొరపాట్లు వస్తే నిర్వహణ బాధ్యతల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, ఎఇ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జెసి రాజు

బొబ్బిలి: రోటరీ క్లబ్ అద్యక్షులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు జెసి రాజు మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని మల్లమ్మపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మతిస్థిమితం కోల్పోయిన ఒక వ్యక్తి దుస్తులు లేకుండా ఉన్నాడు. అటువైపు వెళ్లిన వారంతా మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని చూసి అయ్యో పాపం అంటున్నారే తప్ప ఆయనకు ఎటువంటి సహాయం చేయలేదు. మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తించిన ప్రజాశక్తి విలేకరి రాయగడ జగదీశ్వరరావు రోటరీ క్లబ్ అద్యక్షులు జెసి రాజుకు సమాచారం అందించడంతో ఆయన బుధవారం ఉదయం మతిస్థిమితం లేని వ్యక్తికి దుప్పటి కప్పడంతో పాటు వస్త్రాలు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నాడు. అనాధులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాజు అన్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

రోడ్డు బాగు చేయాలని జనసేన నిరసన

బొబ్బిలి: రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన మండల అద్యక్షులు ఎస్.గంగాధర్ మాట్లాడుతూ పట్టణంలోని సాయినగర్ కాలనీ సమీపంలో బొబ్బిలి-పార్వతీపురం రోడ్డుపై పెద్దగొయ్యి ఏర్పడడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డుపై పెద్దగొయ్యి ఏర్పడినప్పటికీ బాగు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదాలు జరగకముందే రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూనిస్టు ప్రతిభ

బొబ్బిలి: పట్టణానికి చెందిన కార్టూనిస్టు జి.భాస్కరరావు ప్రపంచ కార్టూన్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. విశాలాక్షి మాసపత్రిక, నెల్లూరు మామిడిపూడి రామకృష్ణయ్య స్మారక సాహితీ సంస్థ ప్రపంచ స్థాయి కార్టూన్ పోటీలు నిర్వహించగా భాస్కరరావుకు ప్రత్యేక బహుమతి లభించింది. నెల్లూరులో త్వరలో జరగనున్న ద్విశతాబ్ది ఉత్సవాలలో షీల్డ్ శాలువాతో సత్కారంతో నగదు బహుమతి అందుకోనున్నారు. భాస్కరరావును పలువు అభినందిస్తున్నారు.

విద్యుత్తు సబ్ స్టేషన్ పరిశీలన

జామి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను బుధవారం విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ మువ్వల లక్ష్మణరావు సందర్శించి రికార్డులు పరిశీలించారు. తరువాత సిబ్బందికి భద్రత ప్రమాణాలపై తగు సూచనలు చేశారు. జామి-3 సచివాలయం సందర్శించి సచివాలయం సిబ్బందికి, వాలంటీర్ల సేవలు గురించి అవగాహన కల్పిస్తూ విద్యుత్ శాఖ సర్వీసులు సచివాలయం ద్వారా పెంచడానికి తగు సూచనలు చేశారు. వైఎస్ఆర్ చేయూత ఆధార్ సీడింగ్ వంటి కార్యక్రమాల్లో వాలంటీర్లు చురుగ్గా పాల్గొనాలని చెప్పారు. కుమరం సబ్ స్టేషన్ సందర్శించి సబ్ స్టేషన్‌లో సిబ్బందికి భద్రతా ప్రమాణాలు మీద అవగాహన కల్పిస్తూ రికార్డులు తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా గురించి ఆరా తీశారు. తర్వాత అన్నమరాజుపేట, మోకాస కొత్తవలస గ్రామాలను సందర్శించి ఆర్‌డిఎస్ఎస్ మోడరనైజేషన్ స్కీం పనుల స్థితి గురించి కొన్ని సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఆయన వెంట విజయనగరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు, కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పెద్దింటి త్రినాధరావు, ఎస్‌కోట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి వెంకటరావు, జామి ఎఇ సిహెచ్ దేముడు ఉన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డెంకాడ: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని గుణుపూరు, పినతాడివాడ గ్రామాల్లో డయేరియా ప్రబలిన సందర్భంగా బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులు విరోచనాలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి చికిత్స అందించారు. గ్రామంలో తాగునీరు క్లోరినేషన్, పరిసరాలు పరిశుభ్రత గురించి ఆరోగ్య విద్య ద్వారా ప్రజలందరికీ తెలియజేశారు. తాగునీరు కాచి చల్లార్చి తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, చేపలు, మాంసం వంటి వాటికి దూరంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం. పావని తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బిపిఎ రాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నోట్ బుక్స్, వర్క్ బుక్స్, టోటల్, జెవికె, జిఇఆర్, నాడు నేడు పనులు, బైజుస్, ఆర్ సిస్టం కంటిన్యూ, పాఠశాల పరిసరాలు, కో లొకేటెడ్ పాఠశాలలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

రామభద్రపురం: మండల పరిధిలో గుర్తించిన అసైన్డ్, డీపట్టా, ప్రభుత్వ భూములను వెంటనే భూమిలేని నిరుపేదలకు, ఎస్‌సి, ఎస్‌టిలకు పంపిణీ చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో వేల ఎకరాలు ప్రభుత్వ భూములను కొంత మంది ఆక్రమణ చేసి రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాలు చేయించుకుంటున్నారని, పేదలకు పట్టాలివ్వడానికి మాత్రం భూమి లేదంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ న్యాయ సలహాదారు మారిశెట్టి ఆనందరావు, మండల కన్వీనర్ రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కర్‌రావు బుధవారం పరిశీలించారు. అనంతరం బైజుస్ ట్యాబ్స్ వర్క్ గురించి, అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ ఎంతవరకు పూర్తి చేశారని అడిగి తెలుసుకున్నారు. టోఫెల్ తరగతులు, టైం టేబుల్ చూపించి టైం టేబుల్ ప్రకారం విద్యార్థులకు వారం రోజుల్లో మూడు రోజులు బోధించాల్సిన అంశాలను సూచించారు. విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అనంతరం ఉపాధ్యాయులు లెసన్ డైరీను పరిశీలించారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సిఆర్‌పిలు పాల్గొన్నారు.

గురుదేవ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

● 25వ వార్షికోత్సవంలో జిల్లా కలెక్టర్ ● వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

వికలాంగులకు, పేద ప్రజలకు గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అన్నారు. బుధవారం మంగళపాలెం వద్ద గల శ్రీ గురుదేవ్ చాటిబుల్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఇటువంటి సేవలు అందించడం అభినందనీయమన్నారు. మానవతా దృక్పథంతో వికలాంగులకు కనీస సౌకర్యాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర నలుమూలలు నుంచి గాక, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వికలాంగులకు అన్ని సౌకర్యాలూ కల్పించి, కృత్రిమ అవయవాలు అందించడం గొప్ప విషయమన్నారు. గురుదేవా ట్రస్టు ద్వారా కేవలం కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడమే గాక, పేద రోగులకు కనీస


కృత్రిమ అవయవాలు గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న జగదీష్‌బాబు

వైద్య సదుపాయం అందించాలని ఆస్పత్రి నిర్మించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ట్రస్ట్‌కు సహాయ సహకారాలు అందిస్తున్న వారికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. వికలాంగుల అభ్యున్నతి కోసం జగదీశ్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అందిస్తున్న సేవలు మహత్తరమైనవని కొనియాడారు. 25 ఏళ్ల పాటూ సుమారు 2లక్షలకు పైగా కృత్రిమ ఉపకారణాలను వికలాంగులకు ఉచితంగా అందజేసి, వారి స్వయం ఉపాధికి సహకరిస్తున్న జగదీశ్ సేవలను కలెక్టర్ అభినందించారు. ముందుగా ట్రస్ట్ ప్రాంగణంలోని అవయవ తయారీ కేంద్రం, గురుదేవ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు. అనంతరం పలువురు వికలాంగులకు కలెక్టర్ చేతుల మీదుగా కృత్రిమ కాళ్ళు, చేతులు, చెవిటి మిషన్లు, బ్లైండ్ స్టిక్స్, వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఉప తహశీల్దార్ రమేష్, ఆర్.ఐ రాజేష్, ఇఓపిఆర్‌డి కర్రి ధర్మారావు, పి.ఎస్ విశ్వనాదు కృష్ణారావు, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, గురుదేవ ఆస్పత్రి సిఇఒ అచ్యుతరామ్మయ్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న నాయకులు

పేదలకు వస్త్రాలు పంపిణీ

నెల్లిమర్ల : నగర పంచాయతీ 17వవార్డులో కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మహేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం నెల్లిమర్లలో పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన కుమారుడు ప్రదీప్ నాయుడు చేతులు మీదుగా బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ బంగారు సరోజినీ, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ ఛైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, వైసిపి జిల్లా కార్యదర్శి గంటా సతీష్, కౌన్సిలర్ శ్రీనివాసరావు, పైల మురళీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 20 నుండి 29 విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై జరగనున్న ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వెంకటరమణ పేట వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ మాట్లాడుతూ తెలుగు ప్రజలు పోరాడి 32 మంది రైతన్నలు ప్రాణత్యాగాలతో 16వేల మంది రైతులు 22 వేల ఎకరాల భూమి త్యాగఫలంతో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎలాగైనా ప్లాంటును రక్షించుకొని తీరుతామని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఈ ప్రాంత ప్రజలు గత 1000 రోజులగా పోరాడుతున్నారన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పులు లేదు సరి కదా దీనిని అమ్మడం సాధ్యం కాకపోతే మూసివేస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి బెదిరింపులకు పూనుకున్నారన్నారు. ఆలస్యమవుతున్న కొద్దీ ప్రజలు కార్మికులు నీరసపడిపోయి ఉద్యమాన్ని ఆపివేస్తారని మోడీ ప్రభుత్వం భావించిందని అయితే వారి అంచనాలకు భిన్నంగా


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రెట్టింపు ఉత్సాహంతో పట్టుదలతో కార్మికులు పోరాడుతున్నారని గుర్తు చేశారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నుండి 29 వరకు ఉత్తరాంధ్ర బైక్ యాత్ర చేపట్టిందన్నారు. 20న విశాఖ జివిఎంసి స్టీల్ దీక్ష శిబిరం వద్ద యాత్ర ప్రారంభించి 29న కూర్మన్నపాలెం స్టీల్ దీక్షా శిబిరం వద్ద వేలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ పోరాటంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి భాస్కరరావు, టి. వెంకట అప్పారావు, జి. రామునాయుడు, టి. ఈశ్వరరావు, టి. కృష్ణ, కె. భాస్కర్ రావు, కే. రాము తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్దే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ముందుగా సుమారు రూ.40లక్షలతో నిర్మించిన పూసపాటి రేగ -2 సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సిహెచ్ అగ్రహారంలో నూతనంగా సుమారు రూ.18 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను, చౌడవాడ రూ .18 లక్షలతో నిర్మించి వెల్నెస్ సెంటర్‌ను, రూ .16 లక్షలతో నిర్మించిన బల్క్ మిల్క్ సెంటర్‌ను ప్రారంభించారు. గోవిందపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ .22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.58 లక్షలతో నిర్మించిన భరణికం రోడ్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కోట్లాది రూపాయలతో సచివాలయాలు, వెల్నెస్


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను నిర్మించిన ఘనత ఈ ప్రభుత్వాని దేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి అల్లాడి రమేష్, నాయకులు మహంతి జనార్దన్ రావు, పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు, సర్పంచులు టి సీతారాం, బాలా రామలక్ష్మి, బాల అప్పలరాజు, పట్టింపు శ్రీనివాసరావు, పట్టింపు శివ, రాజ్యలక్ష్మి, మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్న రెడ్డి పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఫోరెన్సిక్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి అన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫోరెన్సిక్ ఫైండ్స్ 2కె23 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర చాలా కీలకంగా మారిందన్నారు. నేర స్థలం వద్ద ఆధారాల సేకరణ పైనే నేరస్థులకు శిక్షపడే అవకాశం ఉందన్నారు. ఆ విధంగా సామాజిక న్యాయం అందించడంలో కూడా ఫోరెన్సిక్ నిపుణులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. త్వరలోనే ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ కోర్సును ప్రారంభించనున్నామని స్పష్టం చేశారు. డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్‌గా ఉన్న దానిని స్కూల్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్‌గా మార్చనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ నేర పరిశోధనలో స్పష్టమైన విధానాలను అనుసరించాలన్నారు. ఈ సమయంలోనే ఎక్కువ సమయం వెచ్చించి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సురేందర్ కుమార్ పాల్ లైంగిక వేధింపులు- పోక్సో కేసుల దర్యాప్తు అనే అంశంపై ప్రసంగించారు. జాతీయ న్యాయ వ్యవస్థ విధానాల గురించి డైరెక్టర్ డాక్టర్ అంకిత్ శ్రీవాస్తవ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ నాగజోగయ్య, ప్రవల్లిక, మనీషి శ్రీవాస్‌లతోపాటు చత్తీస్‌ఘడ్ నుంచి కళింగ యూనివర్సిటీ, బిలాస్‌పూర్‌లోని గురు గాసీదాస్ యూనివర్శిటీ, కాకినాడలోని ఆదిత్య కళాశాల, సెంచూరియన్ విశ్వవిద్యాలయం భువనేశ్వర్, ఆంధ్రప్రదేశ్ క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి దీక్షలు

ప్రజాశక్తి- బొబ్బిలి

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా బొబ్బిలిలో టిడిపి చేపట్టిన సామూహిక నిరాహారదీక్షలకు కల్లుగీత కార్మికులు, గిరిజనులు బుధవారం మద్దతు తెలిపారు. దీక్షలను మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస గౌరు, గిరిజనలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నెల్లిమర్ల:** నియోజకవర్గ కేంద్రంలో బుధవారం టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో నాయకులు మహంతి చిన్నం నాయుడు, కంది చంద్ర శేఖర్ రావు, సువ్వాడ రవి శేఖర్, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, కర్రోతు సత్యనారాయణ, పోతల రాజప్పన్న, లెంక అప్పలనాయుడు, చింతపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** పట్టణంలోని టిడిపి వర్గాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ఆకుల డిపో వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, ధార గంగమ్మ ఫంక్షన్ హాలు వద్ద నియోజకవర్గ ఇంచార్జి కోళ్ల లలిత కుమారి నియోజకవర్గ టిడిపి నాయకులతో వేరువేరుగా రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ రిలే నిరాహారదీక్ష శిబిరంలో 300 మంది యాత సామాజికవర్గానికి చెందిన వారు పాల్గొన్నారు. ఐదు మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

6న వైద్య శిబిరం

బొబ్బిలి: గొల్లపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వచ్చేనెల 6న జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. జగనన్న ఆరోగ్య సురక్షను జయప్రదం చేయాలని గొల్లపల్లిలో బుధవారం ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అక్టోబర్ 6న యుపిహెచ్‌సిలో వైద్య శిబిరం నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంపై ప్రచారం చేయాలని సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

డి-పట్టా భూముల పరిశీలన

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్


భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శైలజ

మండలంలోని కృష్ణాపురం, కోమటిపల్లి, పాత బొబ్బిలి రెవెన్యూ గ్రామాలలోని డీ-పట్టా భూములను ఆర్‌డిఒ పి. శేష శైలజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం డీ పట్టా భూములను డి-పట్టాదారుడు సాగులో ఉన్నట్లయినా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 22ఎ జాబితా నుండి డి - పట్టా భూములను తొలగింపులో భాగంగా ఈ పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్ అప్పయ్య, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

అంగన్వాడి వర్కర్స్ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు కోరారు. అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం కంటే మన రాష్ట్రంలో జీతం పెంచి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాడ్యూటీ, పెన్షన్


మాట్లాడుతున్న శంకరరావు

చెల్లించాలని తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడం లేదన్నారు. అంగనవాడీలపై వేధింపులు పెరిగాయన్నారు. అనేక రకాల యాప్‌లు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు నాయకులు జె. కామేశ్వరి, బి.నిర్మల, ఎస్. కామేశ్వరి, ఉమాగౌరి పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను డిఎంహెచ్ఒ పరిశీలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కొట్టం పిహెచ్‌సి పరిధిలోని ఎస్‌కోట సచివాలయం-4లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను బుధవారం జిల్లా వైద్యాధికారి భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించి అభయ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పనితీరును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక, శిరీష, రామకృష్ణ, శంకర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


ఆయుష్మాన్‌భవ కార్డులను చూపిస్తున్న భాస్కరరావు


రికార్డులను పరిశీలిస్తున్న డిఇ గోవిందరావు

ఇంటింటి కుళాయికి నిధులు

ప్రజాశక్తి - వేపాడ

జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గానికి రూ. 90 కోట్లు నిధులు మంజూరయ్యాయని డిఇ వై గోవిందరావు తెలిపారు. మండలంలోని బుధవారం ఆయన పర్యటించి తాగునీరు నిల్వ ఉంచేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. వీలుపర్తి సచివాలయం పరిధిలో గల చామలాదేవి అగ్రహారం, రాయుడుపేట, కుంపల్లి సచివాలయం పరిధిలో దొగ్గపేట ప్రాంతాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట అధికారులు కె. పైడిరాజు, ఎఇ దేవి, బి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య రంగం బలోపేతం

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతి స్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు జిల్లాకు ఒక వైద్య కళాశాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ రమాదేవి, వైసిపి పట్టణ అద్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, కౌన్సిలర్లు,పాల్గొన్నారు.

సింగవరంలో పొలంబడి

డెంకాడ: మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన కొర్నాన రమణ పొలంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ పూడి నిర్మల పురుగు తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ పంట వేసిన రైతులంతా కచ్చితంగా పంట నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల రైతు వేసిన పంటలకు పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, ఎఇఒ రామకోటి, ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ అసిస్టెంట్ బి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు.. పేటిఎంతో వసూళ్లు

రేగిడి: స్త్రీ నిధి ద్వారా మంజూరు చేసిన రుణాలు రికవరీ చెల్లింపులు పేటియమ్ ద్వారా వసూలు చేయడానికి పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో రేగిడి, జామి, నెల్లిమర్ల మండలాలను ఎంపిక చేసినట్లు స్త్రీనిధి ఎజిఎం అల్లు ఉమామహేష్ తెలిపారు. బుధవారం మండలంలోని సంకిలి గ్రామంలో విఒఎలకు పేటిఎం మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల నుండి స్త్రీనిధి రుణ రికవరీ చెల్లింపులు పేటియం మిషన్లు ద్వారా అమలు చేయాలన్నారు. మహిళా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికి జీవనోపాధి కార్యక్రమాలకు రూ.లక్ష వరకు స్త్రీ నిధి ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. చెల్లింపులు పారదర్శకంగా ఉండేందుకు ఈ పేటియమ్ మిషన్లు ఉపయోగపడతాయని చెప్పారు.

గ్యాస్ లీకై వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల


మృతురాలి పాపాయ్యమ్మ

మండలంలోని గరికిపేట గ్రామానికి చెందిన మహంతి పాపాయ్యమ్మ (67) గ్యాస్ లీకై ఒంటికి మంటలు అంటుకోవడంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 17 ఆదివారం ఉదయం 5.30 గంటలకు నిద్ర లేచి టీ పెట్టేందుకు గ్యాస్ పొయ్యి వద్దకు వెళ్లింది. గ్యాస్ పొయ్యి ముట్టించడంతో అప్పటికే గ్యాస్ లీకై ఉండటం వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగి అమెకు అంటుకున్నాయి. దీంతో ఆమె పెద్దగా కేకలు వేసేసరికి ఇంట్లో నివసిస్తున్న తన కుమారుడు కృష్ణ లేచి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే ఆమె శరీరం కాలిపోవడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ మూడు రోజులు చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మృతురాలికి కుమారుడు కృష్ణ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

బియ్యం పట్టివేత

రామభద్రపురం: మండల పరిదిలోని ఇట్లా మామిడిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ సిఐ సింహాచలం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు బుధవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. మాకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు వారణాసి కల్యాణి ఇంట్లో సుమారు 35 బస్తాల్లో 1700 కిలోల రేషన్ బియ్యం అక్రమ నిల్వలు ఉన్నట్లు గుర్తించాం. బియ్యాన్ని సీజ్ చేసి ఆమెపై కేసు నమోదు చేశాం. రేషన్ బియ్యాన్ని అధిక మొత్తంలో అక్రమంగా నిల్వ చేయడం చట్ట విరుద్ధం. ఇలా ఎవరైనా నిల్వ చేసి రవాణా చేస్తే మాకు తెలియ పరచాలని ఆయన కోరారు. ఆయన వెంట సిఎస్‌డిటి సాయికృష్ణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

జారి పడి మహిళ మృతి

రామభద్రపురం: నేరెళ్ళవలస గిరి శిఖర ప్రాంతానికి చెందిన బోయిన పైడితల్లి (60) ప్రమాదవ శాత్తూ కొండపై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతురాలి పైడితల్లి భర్త ఎర్రపుదొరతో కలిసి ఈ నెల 8న వివాహ కార్యక్రమం నిమిత్తం జీలుగువలస వెళ్లారు. అదే రోజు రాత్రి భర్త స్వగ్రామం చేరుకోగా బార్య రాత్రి అక్కడే బస చేసి మర్నాడు 9వ తేదీన ఇంటికి బయలు దేరింది. దారిలో వర్షం పడటంతో బట్టలు, ఆమె వద్ద ఉన్న కొంత నగదు తడిసి పోవడంతో వాటిని అదే దారిలో ఉన్న ముక్కుడు కొండపై ఆర బెట్టుకొనే క్రమంలో కొండపైకి ఎక్కి సుమారు 50 మీటర్ల కిందకు జారిపడిపోవడంతో మృతి చెందింది. మర్నాడు రావాల్సిన బార్య ఇంటికి చేరక పోవడంతో భర్త 10వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాం. మృత దేహాన్ని గుర్తించి బాడంగి వైద్యాధికారితో కలిసి ఆనవాళ్లు నమోదు చేసి బంధువుల సమక్షంలో మృతదేహం పైడితల్లిదేనని నిర్ధారించుకొని పంచనామా నిర్వహించామని ఎస్ఐ తెలిపారు.